క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



వీపనగండ్ల: మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య తన అనుచరులతో కలిసి శనివారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సహించలేకే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఎత్తం కృష్ణయ్య తెలిపారు. ఈ చేరిక సమయంలో పీసీసీ నాయకులు మల్లురవి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, అభిలాష్ రావు ఉన్నారు. వీరితో పాటు చిన్నంబావి మండలానికి చెందిన చిందబరెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఆవుల వెంకటయ్య, వీరబాబు, ముత్యాలు, స్వామి, అంజి, రాజు తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో ఎమ్మార్సీ భవనం



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం (ఎంఈఓ కార్యాలయం) శిథిలావస్థకు చేరుకొని పైకప్పు పెచ్చులూడుతోంది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో ముసురు వానలతో పైకప్పు కారుతుందని, గోడలు నెర్రెలు వారి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, ఇతర సామగ్రి వర్షపు నీటికి తడిసి పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే భవనానికి మరమ్మతు చేపట్టాని సిబ్బంది కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పెబ్బేరు: మండలంలోని వైశాఖాపూర్ గ్రామానికి చెందిన పింజర్ హుస్సేన్ గుండెపోటుతో శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచన మేరకు బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వనం రాములుయాదవ్ బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బాల్‌చంద్రారెడ్డి, వెంకటయ్య, కృష్ణ, పరమేష్‌నాయి, సందీప్‌రెడ్డి, మన్యం, మధు, రామకృష్ణ, గోపాల్, సహదేవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని ఆముదంబండతండాలో నీటిగుంటలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి చిన్నారెడ్డి రూ.5 వేలు, సల్కెలాపురం గ్రామానికి చెందిన సాయిచరణ్ రెడ్డి రూ.5 వేలు, బీజేపీ నాయకులు రూ.10 వేలు, తూడి కంపెనీ వారు రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

వనపర్తి: పెద్దమందడి మండలం పిల్లికుంట తండా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు తిరుపతితో పాటు పలువురు తండావాసులు శనివారం జిల్లా కేంద్రంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వనపర్తి మండలం పెద్దగూడెం నుంచి కావలి ఆంజనేయులు, రాణి, మన్నెం, లక్ష్మి, తిరుమలమ్మ, నర్సమ్మ తదితరులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

సంకల్ప రథయాత్రకు తరలిరావాలి

చిన్నచింతకుంట: పాతపెన్షన్ విధానం సాధన సంకల్ప రథయాత్రకు ఉద్యోగులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి కోరారు. మండలకేంద్రంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో యాత్ర ఉంటుందన్నారు. తహసీల్దార్ సువర్ణరాజు, నాయకులు రాఘవేంద్ర, అనిల్‌కుమార్, శశికిరణ్, సంజీవయ్య, శ్రీనివాస్, వెంకట్రాములు, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా..

పెంట్లవెల్లి: రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాగానే మత్స్యకారులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని చౌట చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులతో ముచ్చటించారు. ఖచ్చితంగా రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందని మత్స్యకారులకు కావాల్సిన చేయూత అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ జాబితా



వీపనగండ్లలో ఓటరు జాబితాపై సూచనలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు

ఖిల్లాఘనపురం: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయడంలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని ఆర్‌డీఓ పద్మావతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని బీఎల్‌ఓలకు ఓటర్ల జాబితా తయారు చేసే విధానంపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టడం నిరంతర ప్రక్రియ అన్నారు. బీఎల్‌ఓలు శిక్షణలో చెప్పే ప్రతి విషయాన్ని అర్థం చేసుకుని ఫామ్ 6, 7, 8 లను ఎలా పూరించాలి అనే విషయాలను తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి, ఆధారాలు తీసుకుని కొత్తగా దరఖాస్తు చేయించాలన్నారు. అడ్రస్‌లు మార్పు, పేర్లు మార్పు తదితర ప్రతి అంశాన్ని ఎలా సవరించాలనేది బీఎల్‌ఓలు తెలుసుకుని ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పరమేశ్వర్, శిక్షకులు శ్రీనివాసులు, రామకృష్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: గ్రామాల్లోని ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా గ్రామంలోని బీఎల్‌ఓలపై ఉంటుందని తహసీల్దార్ పాండునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీఎల్‌ఓ యాప్‌ను సమర్థవంతంగా వాడుకుని ఇంటింటి సర్వే నిర్వహించడం వల్ల ఓటర్ జాబితా తయారీలో తప్పులు దొర్లకుండా ఉంటాయని ఆయన సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, చిన్న తప్పు చేసినా పెద్ద శిక్ష పడే ఆస్కారం ఉంటుందని ఆయన బీఎల్‌ఓలను హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు లక్ష్మీకాంత్, శ్రీనివాస్, ఎక్బాల్, శిక్షకులు, బీఎల్‌ఓలు సుగుణాభాయి, కృష్ణమ్మ, లక్ష్మి, చంద్రకళ, పారిజాత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..

బాధ్యతగా పనిచేశా.. బరిలో ఉంటా



మాట్లాడుతున్న జగదీశ్వర్‌రావు

వీపనగండ్ల: నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలకు అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ ఆదేశాలను పాటిస్తూ బాధ్యతగా పనిచేశానని, రాబోయే ఎన్నికల్లో కొల్లాపూర్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతానని పీసీసీ సభ్యుడు చింతపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. శనివారం సంగినేనిపల్లిలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అవకాశవాద రాజకీయాల కోసం పనిచేసిన పలువురు ఆపద సమయంలో కార్యకర్తలను పట్టించుకోలేదని మండిపడ్డారు. తమ పార్టీలోకే అందరూ వచ్చినా నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సర్వేలు, కార్యకర్తల అభీష్టం మేరకే కాంగ్రెస్ పార్టీ టికెట్ లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి అధికార పార్టీ నేతలపై ఒత్తిడి చేశామని, అందుకు నియోజకవర్గంలోని కార్యకర్తల సహకారాన్ని కూడా తీసుకున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు అధిక సంఖ్యలో తమకు మద్దతు తెలియజేస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొల్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్, చిన్నంబావి మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, పందెం విజయ్ భాస్కర్‌రెడ్డి, రామ్‌సింగ్, మాజీ సర్పంచ్‌లు రామస్వామి, ఖాజ, రాజశేఖర్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై సాయిచంద్ విగ్రహం ఏర్పాటు చేయండి

అమరచింత: ప్రముఖ గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్ దివంగత సాయిచంద్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని అమరచింతలో బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా ప్రధానకార్యదర్శి విజయ్, దుప్పల్లి కురుమూర్తి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో సాయిచంద్ తన ఆటాపాటలతో జనంలో ఉత్తేజం నింపుతూ ప్రజా ఉద్యమానికి నాంది పలికాడని కొనియాడారు. ధూంధాంలు నిర్వహించి చైతన్య పరిచాడని, బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ఎన్నికల సమయంలో నిర్వహించిన సభలో పాల్గొని తన గాత్రం ద్వారా జనం ఆదరణతో పాటు అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన సాయిచంద్‌కు సీఎం కేసీఆర్ తగున్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కవి తిరుమలేష్, డీసీ రాజశేఖర్, దామోదర్, దేవ తదితరులు పాల్గొన్నారు.

హై ఓల్టేజీ కరెంట్‌తో షాపులో సామగ్రి దగ్ధం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో శనివారం విద్యుత్ హై ఓల్టేజీలో సరఫరా కావడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉన్న హోటళ్లలోని గ్రైండర్లు, ఇంటర్‌నెట్ షాపులో కంప్యూటర్లు, పలు దుకాణాల్లో ఇన్వర్టర్లు , ఆంప్లిఫ్లేయర్ తదితర సామగ్రి కాలిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలోని దుకాణాల యజమానులు విద్యుత్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో వ్యత్యాసాలతో రోజూ ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా సిబ్బంది స్పందించి విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లను సరిచేయాలని వారు కోరుతున్నారు.

రైతు బాంధవుడు కేసీఆర్

కోయిల్‌కొండ: దేశంలో ఎక్కడాలేని విధంగా ఎన్నో సంక్షేమం పథకాలు ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ రైతులకు ఆపద్బాంధవుడుగా మారారని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శేరివెంకటాపూర్ రైతువేదికలో నిర్వహించిన రైతుసదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ 24గంటల ఉచిత కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ నాయకులు 3గంటలు సరిపోతుందనడం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. కటిక చీకట్ల కాంగ్రెస్సా.. కరెంట్ వెలుగుల బీఆర్‌ఎస్సా.. ఏది కావాలో రైతులు నిర్ణయించుకోవాలని సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండోచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు ఘన సన్మానం

కొల్లాపూర్: మంథనికి బదిలీ అయిన ఆర్డీఓ హనుమనాయక్‌కు శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఉద్యోగులతో పాటు, పలువురు నాయకులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా కొల్లాపూర్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజును వారు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్, తహసీల్దార్ శివశ్రీనివాస్ ఉన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న మండ్ల దేవన్ననాయుడు

వనపర్తి టౌన్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెల్లప్ప కమిషన్ రిపోర్ట్ ఆధారంగా వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి, ఆమోదించాలని కేంద్రాన్ని కోరినప్పటికీ ఇంకా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బీజేపీ నాయకులు బోయలను ఎస్టీలో చేర్చేందుకు కృషి చేయాలని కోరారు. వాల్మీకి బోయ జాతి పుట్టుకతోనే గిరిజనులు అని, వాల్మీకి బోయలను ఎస్టీ జాబితా నుంచి తొలగించి అణిచివేశారని వాపోయారు. వాల్మీకి బోయలతో పాటు బేదర, కిరాతక, నిషాది, పెద్ద బోయ, బాట్ మదురాలు, చామర్, మదురాలను ఎస్టీలో చేర్చాలని తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపారని గుర్తు చేశారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని 1956 నుంచి ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బుసిరెడ్డి స్వామినాయుడు, అరవింద్ నాయుడు, గోవర్ధన్ నాయుడు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ ప్రభుత్వంపై పోరాడిన ధీశాలి దాశరథి



దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ఎలుగెత్తి చాటిన రాజ్యాధిక కవి దాశరథి కృష్ణమాచార్యులని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ అన్నారు. దాశరథి జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. నిజాం ప్రభుత్వంతో ప్రజల పక్షాన పోరాడిన దాశరథి స్వాతంత్రోద్యమంలో తన శక్తిని స్వరాజ్యం కోసం ధారపోశాడని కొనియాడారు. అభ్యుదయ భావజాలం కలిగిన దాశరథికి కేంద్ర సాహిత్య అకాడమీ నుంచే కాక ప్రముఖ యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, ఈశ్వర్, దప్పు నాగరాజు, అమరచింత మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, అజయ్, మొగిలయ్య, చందు, రవీందర్‌గౌడ్, శేఖర్, దేవన్ననాయుడు, నిదర్శన్‌గౌడ్, పరమేశ్వరచారి, గంగాధర్‌చారి, మాధవచారి, సత్యంచారి, మురళీధర్ చారి, వెంకటయ్య చారి, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సర్కారు దిగొచ్చే వరకు పోరాటం



ఖిల్లాఘనపురంలో భిక్షాటన చేస్తున్న కార్మికులు



మదనాపురంలో..

కొత్తకోట: గ్రామ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం దిగి వచ్చి చర్చలు జరిపి కార్మికుల న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 17వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సహదేవుడు, పరమేష్, రవి, రాముడు, భాస్కర్, బొజ్జన్న, కరీం, అరుణ, చిన్నమ్మ, అలివేల ఉన్నారు.

పాన్‌గల్: డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి 17వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో సీఐటీయూ జిల్లా నాయకుడు రాము, కార్మికులు రంగస్వామి, సుబ్బయ్య, నాగన్న, శివరాజు, యాదగిరి, సుగ్రీవుడు, బాలకృష్ణ, నాగమ్మ, చిట్టెమ్మ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, కార్మికులను న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, బాలకృష్ణ, చిన్నమ్మ, రాములు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేసిన కార్మికులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 17వ రోజుకు చేరింది. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మణ్, కృష్ణమూర్తి, పుల్లయ్య, రామస్వామి, రాములు, ఆనంద్, శాంతమ్మ, బాలకృష్ణమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు రాజు అన్నారు. మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో మధు, నాగన్న, గట్టన్న, శ్రీనివాసులు, చెన్నయ్య, రాములు, పరశురాం, రమేష్, తిరుపతయ్య, దస్తగిరి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా సభ్యుడు రాములు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, సాయన్న, నర్సమ్మ, బాలకిష్టయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో శనివారం పారిశుద్ధ్య కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వెంకటేష్, సాయిలమ్మ, కవిత, భాస్కర్, భిక్షపతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం

వనపర్తి టౌన్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో పీర్లగుట్ట మెడికల్ ఆఫీసర్ వైష్ణవి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించి మందులు అందించారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు మెడికల్ క్యాంప్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వసతి గృహం పరిసర ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరగకుండా, నీరు నిల్వ కాకుండా, వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి మాధవిని ఆదేశించారు. వంట సిబ్బంది విద్యార్థులకు వేడివేడిగా వండి పెట్టాలని, నాణ్యమైన కూరగాయలు వాడాలని సూచించారు. దోమల వ్యాప్తి అధికమయితే మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ తదితర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు.



విద్యార్థినులకు మందులు అందిస్తున్న అధికారి బీరం సుబ్బారెడ్డి

ముసురు వర్షాలకు కూలిన ఇళ్లు



కూలిపోయిన మట్టి ఇంటిని పరిశీలిస్తున్న సిబ్బంది

అమరచింత: కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరిన ఇళ్లతో పాటు మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందని, అలాంటి గృహాల్లో ఎవ్వరూ నివసించొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా కోరారు. శనివారం మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పది వార్డుల్లో శిథిల ఇళ్ల వివరాలపై సర్వే చేయించారు. శనివారం జగన్‌వాడకు చెందిన కాడ్గి లచ్చి కి చెందిన మట్టి మిద్దె కూలిపోవడంతో బాధిత కుటుంబ పరిస్థితిని పరిశీలించారు. ఈమేరకు ప్రత్యామ్నాయంగా వేరే ఇళ్లు చూసుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో వర్షాల తాకిడికి మట్టి మిద్దెలు తడిసి కూలిపోతున్నాయని, దీంతో ప్రాణ నష్ట జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి, సురక్షితమైన ఇళ్లల్లో నివసించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది బాలగోపాల్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం చేయాలి



మాట్లాడుతున్న సత్యం

ఖిల్లాఘనపురం: హనుమాన్ చాలీసా పారాయణం ప్రతి హిందువు బాధ్యతగా చేయాలని వీహెచ్‌పీ అఖిల భారత సహ కార్యదర్శి సత్యం, సత్ సంఘ్ ప్రముఖ్ జనార్దన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బెస్తగేరి కమ్యూనిటీ హాల్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీహెచ్‌పీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ దేశమైన భారతదేశంలో ఇతర మతాల వారు పేద హిందువులను గుర్తించి వారికి మాయమాటలు చెప్పి మత మార్పిడికి పాల్పడటం జరుగుతుందన్నారు. హిందు ధర్మం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకున్నప్పుడు ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పడం జరుగుతుందన్నారు. అనంతరం మొట్టమొదటి వైద్యుడు శుశ్రుతుడి జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీ లను శాలువాలతో సన్మానించారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి



ముందరితండాలో హరితహారం పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ అఫ్జల్

కొత్తకోట రూరల్: ప్రతి గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరుకోవాలని పెద్దమందడి ఎంపీడీఓ అఫ్జల్ అన్నారు. శనివారం మండలంలోని ముందరితండా, జగత్‌పల్లిలో శివారులో ఉన్న బంజర్ భూమిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీఓ అఫ్జల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. స్కూల్స్ ఆవరణలో, ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీ స్థలంలో, ఎక్కడ ఖాళీ స్థలం ఉన్న మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వాలని సూచించారు. సీజన్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని, ఇళ్ల చుట్టు పిచ్చి మొక్కలు లేకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో..

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్‌డీఎం ఆఫీస్ వారి ఆధ్వర్యంలో శనివారం చిట్యాల శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే (బీసీ) గురుకుల పాఠశాల ఆవరణలో చింత, వేప, ఔషద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి కోసం మొక్కల పెంపకం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిరణ్‌కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఏఎస్ పవార్, యూబీఐ మేనేజర్ శేఖర్ రెడ్డి, సాయికుమార్, వేణుగోపాల్, ఉపాధ్యాయులు నవీన్, గీతిక, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల బీసీ గురుకుల పాఠశాలలో..

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చూపిస్తాం



మాందాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పాన్‌గల్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడప, గడపకు వివరించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు రోజారమణి, నియోజకవర్గ నాయకుడు అన్వేష్ అన్నారు. శనివారం మండలంలోని మాందాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో గడప, గడపకు బీజేపీ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను తెలిపే కరపత్రాలను పంచుతూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒక్కసారి అవకాశం కల్పించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎల్లేని సుధాకర్‌రావుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జగన్‌గుప్తా, నాగరాజునాయుడు, మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు తమ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం కల్వరాలలో గడపగడపకు బీజేపీ, గుండె గుండెకు ఎల్లేని అనే నినాదంతో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ నేషనల్ హైవే, సోమశిల-సిద్దేశ్వరం బ్రిడ్జి మంజూరులో ఎల్లేని సుధాకర్‌రావు ఎంతో కృషి చేశారని, రాబోయే ఎన్నికల్లో అతడికి మద్దతు ఇస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాకేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు విష్ణు, రాణాప్రతాప్, నరేష్, ప్రతాప్‌గౌడ్, ఎల్లగౌడ్, శివయాదవ్, మధు, కేశవులు, లోకేష్, రవి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.